
(సీరియల్ కథ)

# నిరుద్యోగి...
# ప్రశ్న?



* రచన: శ్రీ పి. వి. డి. ఎన్. మూర్తి. *

[దేశ కాలమాన పరిస్థితులను బట్టి పుస్తుత సమాజంలో నెలకొన్న భయంకరమైన సమస్య "నిరుద్యోగం". దీనిపై ఎందరో, ఎన్నోరకాలుగా వివిధ కోణాలనుండి విభిన్న సన్నివేశాలను చిత్రించినప్పటికి, ఇంతవరకూ ఎవ్వరూ సమగ్రంగా దీని పూర్వా పరాలను చిత్రించలేదనే చెప్పాలి. అందుకే, 'రచనకు వీలైనంత వరకూ ఒక పరమార్థం, నూతనత్వం, సజీవత్వం ఉండాలని' అన్న ధ్యేయంతో ఈ రక్కసి కబంధహస్తాలలో చిక్కుకున్న ఒక జీవితాన్ని ఉదహరిస్తూ, దీని విశృంఖల విహారాన్ని సమగ్ర రూపకల్పన చేయటానికి పూనుకున్నాను, ఫలితమే ఈ రచన, తీర్పు రసజ్ఞులైన పాఠకులదే.

—రచయిత]

"విశాఖ పట్టణంలో ఒక మధ్య తరగతి కుటుంబం. ఆ కుటుంబంలో నలుగురు సభ్యులు, భర్త, భార్య, కొడుకు, కూతురు. ఆ ఇంటి యజమాని నీలాద్రిరావు ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు. మొదటి కాన్పులో కొడుకు పుట్టిన తరువాత ఆ ఇంటి ఇల్లాలు అనసూయ మరి మూడేళ్ళకు రెండవ కాన్పులో ఒక ఆడ బిడ్డను ప్రసవించి కన్నుమూసింది. ఆ కుటుంబానికి ముందూ, వెనుకా బంధువులు, ఆస్తిపాస్తులూ ఏమీ లేవు. ఎవరో ఒకరో, ఇద్దరో దూరపు బంధువులు ఉన్నా వారు పేరుకు చెప్పుకోవటానికి మాత్రమే. అక్కరకు వచ్చేవారేమీ కాదు. తల్లి చనిపోయిన నాటినుండి ఆ బిడ్డలను వారితండ్రే ప్రేమగా పెంచి పెద్ద చేసాడు.

ఉండటానికి ఒక అద్దెఇల్లు. నెలనాడు వచ్చిన జీతములో వాడుకలన్నీ పోగా మిగిలిన చిల్లరతో నెల మొత్తంరోజులూ అతి జాగ్రత్తగా సర్దుకుంటూ ప్రతి చిన్న విషయానికీ ఆలోచించి ఖర్చుచేసుకుంటూ గడుపు తలసిన సంసారం అది. ఉన్నంతలోనే కొడుకు దామోదరరావుకు యం. ఏ. ఇంగ్లీషు లిటరేచర్ చెప్పించారు. తండ్రి కష్టంమీద, తన తెలివితేటలతో సంపాదించుకున్న స్కాలర్‌షిప్‌లతో చదువు పూర్తి, ఇంటి మంచిచెడ్డలు, సంసారభాధ్యతలు చూసుకోవలసి రావటంతో నీరజ చదువు పదవ తరగతితోనే ఆగిపోయింది.

దాము యం. ఏ. పరీక్షలువ్రాసి ఫలితాలకై వేచి ఉన్న రోజులవి. నీలాద్రిరావుగారి ఆరోగ్యం అప్పటికే బాగా క్షీణించింది. కొడుకు చదువుకోసం నీలాద్రిరావుగారు రాత్రి, పగలూ ఎంతో కష్టపడి తను అనుకున్న గమ్యానికి చేర్చి తన ఆరోగ్యం అలా చేసుకున్నారు. అప్పటికే ఆరు నెలలనుండి జీతాలు లేక పోవటంతో ఇల్లు గడవటాని ఊరంతా అప్పులు చేసిన ఆ పరిస్థితుల్లో ఆయన తనకు సరైన వైద్యం కూడా చేయించుకోలేని పరిస్థితి దాపురించింది. కొడుకు ఇంకా అప్పటికి సంపాదనపరుడు కాలేదు.

ఆరోజు యూనివర్సిటీలో యం. ఏ. పరీక్షా ఫలితాలను తెలియజేస్తారని తెలిసి ఉదయమే కాలకృత్యాలు తీర్చుకొని, తండ్రిగారితో విషయము చెప్పి ఆయన ఆశీర్వాదము తీసుకొని తల్లి ఫోటోకు నమస్కరించి యూనివర్సిటీకి బయలుదేరాడు.

ఫలితాలు తెలిసాయి. ఫస్టుక్లాసులో పాసయ్యాడు తను. అంతటితో చదువు ఆపి ఉద్యోగము చేయాలనుకున్న తనకు ఆ విజయవార్త వినటంతో ఇంచుమించుగా ఈ ప్రపంచాన్నంతా గెలిచినంత సంతోషం కలిగింది. ఎన్నో కోర్కెలతో, ఎన్నెన్నో ఆశలతో జీవితాన్ని పూలబాటగా, పండువెన్నెలగా, సుఖమయంగా తలచి వేయి ఆలోచనలు మనసులో మెదులుతుండగా గాలిలో తేలిపోతున్నట్టుగా ఇంటికి చేరుకున్నాడు. తన ఇంటి చుట్టూ కొంతమంది జనం గుమిగూడి ఉండటం చూసి విషయం అర్థంకాక ఆ జనాన్ని తప్పించుకు ముందుకు వెళ్ళాడు. చాపపై పడుకున్న తన తండ్రిపైపడి ఏడుస్తున్న చెల్లెలు నీరజను, తండ్రి తలవద్ద వెలుగుతున్న దీపాన్ని చూసి పరిస్థితిని అర్థం చేసుకున్నాడు.

జీవితంలో తనకు తగిలిన మొదటి దెబ్బ అది. కర్మకాండ అంతాముగిసింది. పట్టుమని పదిరోజులన్నా తిరగకుండా అప్పులవాళ్ళంతా ఇంటిపై పడి బిందె, చెంబు ఎవరికి తోచినవి వారు పట్టుకుపోయారు. ఇంటి యజమాని ఇంటికి తాళం వేసుకున్నాడు.

దాము, నీరజ కట్టుబట్టలతో నడి రోడ్డుమీద నిలబడ్డారు. ఎటూ దిక్కుతోచలేదు, ఏమీ పాలుపోలేదు. నిలాద్రిరావుగారు సంపాదించుకున్న కాస్త మంచిపేరు ఆ పేటలోనే ఒక చిన్న కమ్మల పాకలో ఆ ఇద్దరినీ ఉండేందుకు అవకాశం కల్పించింది. కట్టుబట్టలతో ఆ నీడను చేరుకున్నారు. పరిస్థితులన్నీ తలచుకుంటూ రెండు, మూడు రోజులు ఇల్లు కదలకుండా బాధపడ్డాడు. చివరకి కర్తవ్యాన్ని గుర్తించి ఒకరోజు ఇల్లు కదిలి బయలుదేరాడు.

ఇంకా చదువుకోవాలన్న ఆశ కొద్దిగా మనసులో ఉండటంతో యూనివర్సిటీకి వెళ్ళి ప్రొఫెసరు గారిని కలిసాడు. పి. హెచ్. డి. లో ఛాన్సు ఇప్పించమని అడిగాడు. పి. హెచ్. డి. చేస్తూ యూనివర్సిటీ వారు నెల నెలా ఇచ్చేడబ్బుతో కొంతకాలం పాటు చెల్లెల్ని పోషించుకుంటూ బ్రతకవచ్చని ఆశపడ్డాడు తను.

కానీ ప్రొఫెసరుగారు "చూడు మిస్టర్ దామోదర రావ్, కారణాలు నన్ను అడగవద్దు, నేను చెప్పను, చెప్పలేను-చెప్పకూడదు. నీకు పి. హెచ్.డి. లో ఛాన్సు దొరకటం చాలా కష్టం. ప్రయత్నించడం కూడా అనవసరం. బ్రతుకు తెరువుకు వేరే ఏదైనా మార్గం చూసుకో ఇదే ఆయన ఇచ్చిన సలహా.

ఇది జీవితంలో దాముకు తగిలిన రెండవ దెబ్బ.

ఆ రోజు అలా జరగటంతో మనస్సంతా వికలమై పోగా ఊరంతా తిరిగి, తిరిగి ఇంటికి చేరుకున్నాడు తను.

LPC (R)



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువుగా అతిప్రెషర్‌లో సాదారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును,

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును,

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

______ : వివరములకు : ______

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works ; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002

మరుచటిరోజు ఏమీ తోచక గ్రంథాలయానికి దారి తీసాడు. పాత పేపర్లన్నీ తిరగేస్తూ ఉంటే అప్పటికి పదిరోజుల క్రితం ఒక ప్రైవేటు సంస్థలో గుమస్తాలు కావాలని వేసిన ప్రకటనను చూసాడు. ఆ ప్రకటన సారాంశాన్ని బట్టి వారు కోరిన దానికంటే తనకున్న అర్హత ఎక్కువేనని గుర్తించాడు. కానీ, ఆ రోజే ఇంటర్వ్యూ సమయం పది గంటలకు. అప్పటికే గంట తొమ్మిది కావస్తుంది. గబగబా ఇంటికి వెళ్ళి తన సర్టిఫికెట్స్ అన్నీ తీసుకొని ఆదరా బాదరాగా బయలుదేరి నిర్ణీత సమయానికి గమ్యానికి చేరుకున్నాడు. అప్పటికి అక్కడికి చాలా మంది ఇంటర్వ్యూ కోసం వచ్చి ఉన్నారు. ఇంటర్వ్యూ సరిగ్గా పదకొండున్నరకు ప్రారంభమయింది. దానితో ఇండియన్ పంక్చువాలిటీ అన్న పదానికి పూర్తిగా అర్థం తెలిసివచ్చింది తనకు. చివరకు సాయంత్రం అయిదు గంటలవుతుండగా తన వంతు వచ్చింది. లోనికి ప్రవేశించాడు, లోన ఆ ఆఫీసు మేనేజరు, ఇద్దరు ఆఫీసర్లు, ఒక గుమస్తా ఉన్నారు.

ఇంటర్వ్యూ పద్ధతి ప్రకారం ఊరు, పేరు, వయస్సు, అర్హత అన్నీ అడిగి సర్టిఫికెట్లన్నీ రెఫర్ చేసి, జనరల్ నాలెడ్జిలో కూడా టెస్ట్ చేసి-

"సారీ మిస్టర్, నీకు అన్ని క్వాలిఫికేషన్స్ ఉన్నాయి. కానీ, ఈ ఉద్యోగానికి నీలాగ పోస్ట్ గ్రాడ్యుయేట్స్ కాక, డబుల్ పోస్ట్ గ్రాడ్యుయేట్స్, కూడా ఎంతోమంది వచ్చారు, అందుచేత నీకు ఛాన్సు ఉండటం కష్టం నీవు వెళ్ళవచ్చు" అన్నాడు ఒక ఆఫీసర్.

కొంచెం తటపటాయించి "నాకు ప్రస్తుతం బ్రతుకు తెరువు ఏమీ లేదుసార్ మీరు ఎస్. ఎస్. సి. వాళ్ళు కావాలని వేసిన ప్రకటన చూచి నాకున్న క్వాలిఫికేషన్‌కు తప్పక ఉద్యోగం వస్తుందని ఆశతో వచ్చాను సార్, ఎలాగైనా ఈ ఉద్యోగం నాకు ఇచ్చి సహాయం చేయండిసార్" అన్నాడు.

"కరక్టేనయ్యా. నీకు క్వాలిఫికేషన్ ఉంది. అది చాలు. కాదనను, కానీ నీకంటే ఎక్కువ క్వాలిఫికేషన్ ఉన్న వ్యక్తులు ఇంకా చాలా మంది ఉన్నప్పుడు వాళ్ళను వదిలి నీకు ఛాన్సు ఎలా ఇవ్వమంటావు? నువ్వే ఈ సీటులో ఉంటే ఏం చేస్తావో ఆలోచించు. అదీగాక ఇది ప్రైవేటు సంస్థ, గవర్నమెంటుదికూడా కాదు. సరే మేము చేయగలిగిందేమి లేదు ఇక నీవు వెళ్ళవచ్చు" అనేసాడు.

ఇక ఏమీ అనటానికి పాలుపోక అక్కడనుండి వెను తిరిగాడు.

తొలిసారిగా తనకున్న అర్హత ఏమిటో, తన విద్యకు విలువ ఎంతో తెలిసివచ్చింది ఆనాడు. నిరాశగా ఇంటి ముఖం పట్టాడు. ఆ రోజు నుండీ పేపర్లన్నీ చూడటం, కనబడిన ఆఫీసుకల్లాపోయి ఉద్యోగ ప్రయత్నం చేయటం, ఇదే తన దినచర్య అయిపోయింది. కానీ, ఎక్కడకు వెళ్ళినా చుక్కే ఎదురవుతుంది.

♦ ♦ ♦

రోజులు గడచిపోతున్నాయి. నిరాశ, నిస్పృహలతో రోజూ ఊరంతా తిరిగి ఇంటికి రావటం, వచ్చేసరికి పెళ్ళికి ఎదిగిన చెల్లెల్ని చూస్తూ, "వయసొచ్చిన చెల్లెలికి ఆలనా, పాలనా, ముద్దూ, ముచ్చటా ఏమీ చూడలేకపోతున్నాను నేను. కనీసం ఏమి తింటుందో, ఎలా ఉంటుందో కూడా ఏమీ పట్టించుకోలేక పోతున్నాను నేను. అని మనసంతా బాధను నింపుకోవటం పరిపాటైంది

ఒక రోజు భోజనం వడ్డిస్తూ "అన్నయ్యా! నాన్న చనిపోయిన తరువాత మనఇల్లూ, వాకిలీ తుడిచి పెట్టుకు పోయి, అప్పులవాళ్ళు మిగిల్చిన కాస్త సొమ్ము ఈ రోజుతో పూర్తిగా అయిపోయింది. ఇంట్లో అన్నీ నిండుకున్నాయి. చేతిలో చిల్లిగవ్వలేదు. రేపు వెచ్చాలు తీసుకు రావాలి" అని చెప్పింది నీరజ. ఇంటి పరిస్థితి అప్పటికి పూర్తిగా గుర్తుకు వచ్చి ఏమి చెప్పాలో తోచక "అలాగేనమ్మా" అని భోజనం అయిందనిపించి వాకిలిలో చాపవేసుకొని నడుము వాల్చి పున్నమి చంద్రుని వెన్నెల విహారాన్ని చూస్తున్నాడు. అనేక ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోగా ఏదో ఒక దృఢ నిశ్చయానికి వచ్చాడు.

తెల తెలవారుతుండగానే ఇల్లు కదిలాడు, ఊరంతా తిరిగాడు. రిక్షా త్రొక్కటానికి, హోటలులో సర్వింగ్ చేయటానికి, కిరాణా కొట్లలో పొట్లాలు కట్టటానికి కూడా తను సిద్ధమే నన్నాడు. కానీ, ఎక్కడకు వెళ్ళినా ఎదురయిన సమాధానం ఒక్కటే.

"నీ చదువుకు తగిన ఉద్యోగం మా దగ్గర ఏమీ లేదు. నీవు ఇటువంటి పనులు చేయలేవు. నీవు చేస్తానన్నా ఇటువంటి చిన్న చిన్న పనులు నీలాంటి చదువుకున్న వాడిచేత చేయించి నీ చదువు విలువను కించపరచలేము. అందుచేత మరోలా అనుకోక ఇంకెక్కడైనా, మరే దైనా మంచి ఉద్యోగానికి ప్రయత్నించు" అని.

ఎంత బ్రతిమిలాడినా లాభం లేకపోయింది. తనమీద వాళ్ళకున్న అబద్ధపు జాలికి కోపమూ, ఆ పనులకు కూడా విపరీతమైన పోటీ ఉండటాన్ని చూసి ఆశ్చర్యమూ కలిగాయి.

యథా విధిగా ఉత్త చేతులతో సంధ్య వేళకు ఇంటికి చేరుకున్నాడు. చెల్లెలు దీనంగా చూస్తూ గుమ్మం వద్ద నిలుచుంది. ఆమెకు ముఖం చూపలేక తలదించుకొని గబగబా ఇంట్లోని చాప తీసుకొని ఇంటి ఎదురుగా ఉన్న రావిచెట్టు క్రింద వేసి పడుకున్నాడు.


పరిస్థితి అర్థంచేసుకుంది నీరజ. అప్పటివరకూ రోజు ఉండే ఒక్కపూట తిండి కూడా ఆ రోజు లేదు. ఆ నాటి నుండి పూర్తి పస్తులకు అలవాటు పడవలసి వస్తుందని తలచి బాధను తనలోనే దిగ మింగుకొని అన్నకు ఒకగ్లాసు మంచినీళ్ళు తీసుక వెళ్ళి అందించింది. చెల్లెలు అందించిన మంచినీళ్ళు త్రాగి కళ్ళంట నీళ్ళు జాలువారతుండగా ఒక్కసారి చెల్లెలిని దగ్గరకు తీసుకున్నాడు. వారి బాధలోనే ఆ రాత్రి కరగిపోయింది.

ఆ రోజు పోస్ట్‌లో దానుకు ఒక ఉత్తరము వచ్చింది. విప్పి చూసాడు. విషయం అర్థమైంది. మూడురోజుల తరువాత తన ప్రక్క ఊరి కాలేజీలో లెక్చరర్ ఉద్యోగమునకు ఇంటర్వ్యూకు హాజరు కమ్మని దానిలోని సారాంశం.

దాన్ని చూసిన తరువాత ఆ కాలేజీకి తను ఉద్యోగమునకు ధరఖాస్తు చేసిన విషయం గుర్తొచ్చింది తనకు. అనేకమైన ఆలోచనలతో వేడెక్కిపోయిన బుర్రతో తను ఏం చేస్తున్నాడో తనకే తెలియటంలేదు. "ఏమయితేనేం నా పాలిట ఈ ఇంటర్వ్యూ ఒక వరంగా వచ్చింది" అన్న సంతోషంతో ఆ మూడు రోజులూ ఇల్లు వదలకుండా తన పుస్తకాలూ, నోట్సులూ అన్నీ క్షుణ్ణంగా తిరగేసాడు.

* * *

ఇంటర్వ్యూ రోజు వచ్చింది. చేతిలో చాలినంత డబ్బులేక పోవటంతో ఆ రోజు తెల్లవారి అయిదు గంటలకే బయలుదేరి నడచి తొమ్మిదిన్నరకు ఇంటర్వ్యూ స్థలాన్ని చేరుకున్నాడు. పదిగంటలకు ఇంటర్వ్యూ. ఉన్న ఒక ఉద్యోగానికి ఇంచు మించు వంద మంది వరకూ ఇంటర్వ్యూకు వచ్చారు. భోగట్టా చేయగా ఆ ఇంటర్వ్యూకు అందరూ యం. ఏ. అభ్యర్థులే వచ్చినట్లు అంతకన్నా ఎక్కువ అర్హతలు కలిగిన వారెవరూ రానట్టూ తెలుసుకున్నాడు.



"బంగారులక్ష్మి"

చిత్రంలో

సంగీత – చంద్రమోహన్

ఇంటర్వ్యూ జరిగిపోయింది ఆ రోజు. తనను షేక్స్పియర్ రచనలపై ఇవ్వమన్న లెక్చరును దంచేసాడు. లెక్చరు చెపున్నంత సేపూ ఇంటర్వ్యూ మెంబర్లు అందరి మువ్‌మెంట్స్‌ను చూసి ఆ ఉద్యోగము తప్పక తనకు వస్తుందనుకున్నాడు.

ఇంటర్వ్యూ పూర్తి అయినాక ఇంటికి తిరిగివచ్చి రోజులు లెక్కపెడుతూ ఆర్డర్స్ కోసం ఎదురు చూస్తున్నాడు. చాలా కాలమయింది. కానీ, ఆర్డర్స్ రాలేదు. ఏ విషయమూ తెలియలేదు. వివరాలు తెలుసుకోవటానికి మళ్ళీ ఆ కాలేజీకి వెళ్ళాడు. విషయం తెలుసుకున్నాడు. ఆ ఉద్యోగం ఇంకొకరికి ఇచ్చేసారు. అందుకు బాధ పడలేదు దాము. కానీ, నైపుణ్యతను కూడా గుర్తించక ఆ అధికార్లు, చివరకు అటెండర్లు కూడా తనను కించపరచి నందుకు ఎంతో కృంగిపోయాడు. తనకు ఆ ఉద్యోగం రాకపోవటానికి కారణం కేవలం తనకు రికమండేషన్స్ లేవు, ఇదీ తను అక్కడ తెలుసుకున్నది. ఆఖరికి ఒక అటెండరు కూడా తనతో "కనీసం సూటు లేదు, బూటు లేదు, టైలేదు, షోలేదు. ఉత్తర దక్షిణాలు అసలే లేవు. ఈ ఉద్యోగం నీకు వస్తుందని ఎలా అనుకున్నావయ్యా. అన్నీ ఉన్న వాళ్ళకే దిక్కు లేదు. కేవలం బుకిష్ నాలెడ్జి ఒకటే చాలదయ్యా బాబూ ఈ రోజుల్లో ఉద్యోగాలు సంపాదించటానికి" అన్నాడు.

"ఉద్యోగానికి, అందునా ఉపాధ్యాయ వృత్తికి సబ్జక్టు రావటంకాక, టీచింగ్ కెపాసిటీ ఉండటంకాక ఇంకా ఉండవలసిన ప్రత్యేక అర్హతలేమిటి? సూటు, బూటు, టై, షోలాంటి బాహ్యాకర్షణలా కావలసినవి? ఈ ఉద్యోగం పరిస్థితి ఇలా ఉంటే ఇక మిగతా ఉద్యోగాల పరిస్థితి ఇంకెలా ఉంటుందో" అనుకున్నాడు తనలో తనే.

• • •

మరి కొన్నాళ్ళకు తమ ఊరిలోనే ఒక ఆఫీసులో గుమస్తా ఉద్యోగనికై హాజరయ్యాడు. ఆ ఇంటర్వ్యూ జరిగిన నాలుగురోజులకు సాయంత్రం సమయంలో ఒక పార్కులో కూర్చుని రేడియో కార్యక్రమాలు వింటున్నాడు. ప్రక్కనే ఇద్దరు వ్యక్తులు బిగ్గరగా నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్న మాటలను విన్నాడు. వారి మాటలను బట్టి దాము అర్థం చేసుకున్నది, వారిలో ఒక వ్యక్తి తను ఇంటర్వ్యూకు హాజరయిన ఆఫీసులో పని చేస్తున్నాడు. రెండో వ్యక్తి మొదటి వాని స్నేహితుడు. తమ ఆఫీసులోని ఆ గుమస్తా ఉద్యోగముల గూర్చి పేపరులో ప్రకటించక ముందే వాళ్ళ ఆఫీసరుగారి బావమరిదికీ, ఒక మినిస్టరుగారి తమ్ముడిగారి అబ్బాయికీ ఇలా ఉన్న అన్ని ఖాళీలు ముందే భర్తీ అయిపోయాయనీ, ఊరకనే ఫార్మాలిటీ కోసం ఇంటర్వ్యూ జరిపారని ఆ మొదటి వ్యక్తి స్నేహితునితో చెప్తున్నాడు. అంతా విన్న దాము చాలబాధ పడ్డాడు.

"మెరిట్ చూడకుండా పద్ధతులను ఉల్లంఘించి ముందుగానే ఉద్యోగాలను కేవలం అధికారులకూ, ఆర్థికబలం, పలుకుబడి కలవారికీ దాసోహమయి నియమించటం అన్యాయం. పోనీ జరిగిందేదో జరిగిపోయింది అని అనుకుందామన్నా, అటువంటప్పుడు ఇక పేపర్లో ప్రకటన నివ్వటం దేనికి? ఆ ఉద్యోగం కోసం ఎంతో మంది అభ్యర్థులు ఎంతెంతో దూరము నుండి బోలెడంత సొమ్ము, మరెంతో విలువైన కాలం ఖర్చు చేసుకొని ఆశతో వచ్చారు. వారందరికీ ఈ సంగతి తెలిస్తే వారెంత బాధపడతారు. అసలు ఎందుకిలా జరుగుతుంది? ఎందుకిలా చేస్తున్నారు?" అని ఎంతో దిగులు చెందాడు.

• • •

మరికొన్నాళ్ళకు ఒక ఆఫీసరు ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్ళాడు దాము. ఆఫీసరు పోస్ట్ కాబట్టి ఇంటర్వ్యూ చాలా కష్టముగా ఉంటుందని తలచి సుమారు నెలరోజుల ముందు నుండే రాత్రి, పగలూ ఇంటివద్ద, గ్రంథాలయంలోను అనేక పుస్తకాలు ఎంతో కష్టపడి చదివాడు. ఇంచుమించు పుస్తకాలతో యుద్ధం చేసినంత పని చేసి ఇంటర్వ్యూకు హాజరయ్యాడు.

హాలులోనికి అడుగు పెట్టాడు దాము. ఆ హాలులో అయిదారుగురు సభ్యులు కూర్చుని ఉన్నారు. వారే ఇంటర్వ్యూ ఆఫీసర్లని గ్రహించాడు, హాలులోనికి అడుగు పెట్టగానే "కమిన్" అన్నది వారిలో ఒక కంఠం.

వారివద్దకు నడిచాడు దాము. "గుడ్ మార్నింగ్ సార్స్" అన్నాడు. "టేక్ యువర్ సీట్" అంది వారిలో మరో గొంతు.

(సశేషం)